క్లుప్తంగా

నేడు చెన్నూరుకు ఎమ్మెల్యే

చెన్నూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభించడానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి చెన్నూరుకు రానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలి

కడప కార్పొరేషన్: కడప నగరం 48వ డివిజన్‌లోని బుడగజంగం కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని సీపీఐ తాలూకా జోన్ సహాయ కార్యదర్శి కె. మునెయ్య డిమాండ్ చేశారు. రోడ్లపై గుంతలను పూడ్చి కల్వర్టు ఏర్పాటు చేయకపోవడం వల్ల వీధుల్లోకి డ్రైనేజీ నీరు వచ్చి అపరిశుభ్రంగా తయారైందని పేర్కొన్నారు. నగరపాలక అధికారులు స్పందించి డ్రైనేజీ వాటర్ తొలగించి, కల్వర్టు ఏర్పాటు చేయాలన్నారు.

వెన్నపూసకు మద్దతుగా ప్రచారం

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా రిమ్స్ ఆసుపత్రి, జిల్లా కోర్టులో విస్తృత ప్రచారం నిర్వహించారు. రిమ్స్ హాస్పిటల్, డెంటల్ విభాగం, ఓపి విభాగాల్లో కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. అలాగే జిల్లా కోర్టులో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారం నిర్వహించిన వారిలో ఎస్.వెంకట రామిరెడ్డి, రాము, ప్రసాద్, మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీకి వినతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపరూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులోని చెన్నూరు సెక్టార్ 6వ వార్డులో అంగన్వాడీ వర్కర్‌గా పనిచేస్తున్న సంధ్యారాణి ఆత్మహత్యకు కారకులైన వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్‌సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర అధ్యక్షులు సుబ్బరాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం ఐసీడీఎస్ పీడీ ఎంఎస్ రాణికి వినతిపత్రమిచ్చారు. ఇన్సాఫ్ నగర కార్యదర్శి మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వారు కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రమిచ్చారు.

టికెట్ల ధరలు తగ్గించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: అధిక రేట్లకు టిక్కెట్లను అమ్ముతున్న థియేటర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా విడుదల అవుతున్న వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య ఫ్యాన్స్ షోలకు రూ. 1000 నుంచి రూ.1500 పైగా అభిమానుల నుంచి అక్రమంగా వసూలు చేయడానికి యాజమాన్యాలు పాల్పడుతున్నాయని ఆరోపించారు. థియేటర్లలో మౌళిక వసతులు కల్పించకుండా ప్రభుత్వ నిబంధలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వసూలు చేయడం సరి కాదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు విజయ్ కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

నమూనా కానిస్టేబుల్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న నమూనా కానిస్టేబుల్ పరీక్షను జయప్రదం చేయాలని వన్‌టౌన్ సీఐ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం నమూనా కానిస్టేబుల్ పరీక్ష కరపత్రాన్ని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఇటువంటి ప్రతిభ, నమూన పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ మాట్లాడుతూ ఈ నమూనా పరీక్ష జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేల్ ప్రాంతాల్లో జరుగుతుందన్నారు. నమూనా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు 9912758515 అనే నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు షాకీర్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేడీఏ నాగేశ్వరరావు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఏపీ రైతు సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయశాఖాధికారి కార్యాలయంలో జేడీఏ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించే విధంగా క్యాలెండర్‌ను ముద్రించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, ఉపాధ్యక్షుడు జయన్న పాల్గొన్నారు.

శ్రీ గోదాదేవికి కూడారవెళ్లి పూజలు



కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం శ్రీ గోదాదేవి మాతకు కూడారవెళ్లి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ బృందం ఉదయం 4.30 గంటల నుంచి ఆలయంలోని మూలమూర్తులు, ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. ధనుర్మాసంలో 27వ రోజున శ్రీ గోదాదేవి, శ్రీమన్నారాయణునిలో ఐక్యం చెందిన సందర్భంగా ఈ పూజలు చేపట్టారు. శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులకు ముత్యాల కవచం, వెండి కిరీటాలు, పూలమాలలు అలంకరించి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. లక్ష్మీదేవితోపాటు స్వామి సరసన శ్రీ గోదాదేవికికూడా విశేష అలంకారం చేసి కొలువుదీర్చారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు ఆలయ ప్రాంగణంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. మంగళ వాయిద్యాల మధ్య తిరుప్పావై, మహానివేదన, కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహింపజేసి మాడవీధుల్లో స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఇస్కాన్ సంస్థకు చెందిన భక్తుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొని భజన గీతాలు ఆలపిస్తూ సాగడంప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

దోపిడీ వ్యవస్థపై తిరగబడ్డ యోధుడు నర్రెడ్డి



నర్రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దోపిడీ వ్యవస్థపై తిరగబడ్డ యోధుడు నర్రెడ్డి శివరామిరెడ్డి అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఎద్దుల ఈశ్వర్ రెడ్డి భవన్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కమ్యూనిస్ట్ యోధుడు, మాజీ ఎమ్మెల్యే నర్రెడ్డి శివరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వీరపునాయునిపల్లె మండలంలోని పెత్తందారి భూ స్వామ్య కుటుంబంలో పుట్టినా పెత్తందారి, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి పేదల పక్షాన నిలబడిన కమ్యూనిస్ట్ యోధుడని కొనియాడారు. అనేక నీటి పారుదల ప్రాజెక్టుల కోసం పోరాటాలు చేశారని ఆయన పోరాట కృషికి గుర్తుగా సర్వరాయసాగర్‌కు నర్రెడ్డి శివరామిరెడ్డి పేరు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, కొమ్మద్ది ఈశ్వరయ్య, యానాదయ్య, బాలచంద్రయ్య, వెంకట శివ, కెసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే వడ్డెరుల అభివృద్ధి



అంధుల పాఠశాలలో అన్నదానం చేస్తున్న సంఘం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐకమత్యంతోనే వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారు అభివృద్ధి పథంలో పయనించగలరని వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు రమణయ్య, బత్తల లింగమూర్తి తెలిపారు. బుధవారం నగరంలోని పాత రిమ్స్ లోగల బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ముందుకు సాగినపుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు గంపా వీరయ్య, నంద్యాల నాగరాజు, తమ్మిశెట్టి వేణు, వల్లెపురామచంద్రయ్య, బండారు వెంకట రమణ, దేరంగుల సుబ్బరాయుడు, మంజుల సుబ్బరాయుడు, బత్తల గోపి, బత్తల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగరంలోని అంధుల పాఠశాలలో అన్నదానం చేశారు.

వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకట రమణ

వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకట రమణను నియమించారు. బుధవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రమణయ్య, గౌరవ అధ్యక్షులు బత్తల లింగమూర్తి ఆయనను నియమించారు. సంఘం నాయకులు దేరంగుల సుబ్బరాయుడు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి కవిత

చెన్నూరు : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. చెన్నూరు బెస్తకాలనీ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న జడ్జి పర్యావరణ పరిరక్షణ, పీసీఅండ్ పీఎన్‌డీటీ యాక్ట్, బాల్య వివాహాలు, సీనియర్ సిటిజన్ చట్టం, వినియోగదారుల చట్టాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. అలాగే 181 ఉమెన్ హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీసు హెల్ప్‌లైన్, 14567 సీనియర్ సిటిజన్స్ హెల్ప్‌లైన్‌ల గురించి వివరిస్తూ అవసరమైన సమయాల్లో పైన తెలియజేసిన టోల్‌ఫ్రీ నెంబర్లను వినియోగించుకోవాలన్నారు. చట్టపరంగా ఎలాంటి అవసరమున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకు రావచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విభజన హామీలు సాధించే వరకు పోరాటాలు



సంఘీభావం తెలుపుతున్న వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను సాధించే వరకు పోరాటాలు చేస్తామని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో రాష్ట్ర విభజన చట్టంలోని హామీలపై వివిధ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా ఏపీకి ప్రత్యేక హోదా, రాయలసీమ ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం హామీలను నెరవేర్చకుండా బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలు కోసం యువతను చైతన్య పరిచేందుకు ఈ నెల 20న హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు విద్యార్థి, యువజన సంఘాలతో బస్సు యాత్ర చేపడతామన్నారు వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు వలరాజు, ఎంఆర్ నాయక్, దస్తగిరి, చిన్ని, శివ కుమార్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

జేవీవీ సైన్స్ సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక ఈనెల 21 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాల పోస్టర్లను బుధవారం వైవీయూ ఉప కులపతి ఆచార్య రంగ జనార్దన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, సమాజంలో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంచేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయన్నారు. సంస్థ అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు విద్యార్థులు, ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచేందుకు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రస్థాయిలో పలు ప్రాంతాల నుంచి రానున్న ప్రజలకు అవగాహన కల్పించడానికి, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఈనెల 21, 22 తేదీల్లో జేవీవీ చెకుముకి రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలను కడప నగరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైవీయూ కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, ప్రధానాచార్యులు కృష్ణవేణి, జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్, ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ప్రతినిధులు సరస్వతి, పద్మావతి, కామేశ్వరమ్మ, సునీత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



పెద్దదర్గా ప్రాంగణం

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన కడప నగరంలోని అమీన్‌పీర్ (పెద్ద) దర్గాలో హజరత్ సయ్యద్‌షా దాదా ముర్షద్ అమీన్ పీర్ సాహెబ్ గంధోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తమ ఇంటి వద్దనుంచి ఫకీర్ల మేళతాళాలు, విన్యాసాల మధ్య ఉత్సాహ భరితంగా దర్గాకుతరలి వెళ్లారు. అనంతరం ఆ ప్రాంగణంలోని హజరత్ సయ్యద్‌షా దాదా ముర్షద్ అమీన్‌పీర్ సాహెబ్ మజార్ వద్ద ప్రార్థనలు నిర్వహించి గంధం సమర్పించారు. అనంతరం ఫాతెహా నిర్వహించి భక్తులందరికీ ప్రసాదాలను పంపిణీ చేశారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉరుసు ఉత్సవాలల్లో భాగంగా గురువారం ఉరుసు, శనివారం తహలీల్ ఫాతెహా నిర్వహించనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి

వీరపునాయునిపల్లె: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడు వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎస్.పాలగిరి సచివాలయ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతోఆయన బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. వలంటీర్‌లు ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మంజూరు కాకుండా ఉన్న వారిని గుర్తించి వారికి మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కన్వీనర్లకు సూచించారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే తమకు తెలియజేయాలని వెంటనే ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఆంధ్రా జట్టుకు ఘన విజయం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా నిర్వహించిన అంతర్ రాష్ట్రాల అండర్-25 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు చండీఘర్ జట్టుపై 134 పరుగుల భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. 139 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో చివరిరోజు బుధవారం బరిలోకి దిగిన చండీఘర్ జట్టు 66.5 ఓవర్లలో 221 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఎ.ఎ. కుమార్ 120 బంతుల్లో 6 సిక్సర్‌లు, 9 ఫోర్లతో 91 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. తరణ్‌ప్రీత్ సింగ్ 28 పరుగులు చేశాడు. ఆంధ్రా బౌలర్లు ఎం. ఆంజనేయులు 3, గిరినాథ్‌రెడ్డి 2, సాకేత్‌రామ్ 2 వికెట్లు తీశారు. కాగా చండీఘర్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 186 పరుగులు చేయగా, ఆంధ్రా జట్టు 541 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆంధ్రా జట్టు ఇన్నింగ్స్ 134 పరుగుల ఆధిక్యంతో విజయాన్ని నమోదు చేసుకుంది. ఆంధ్రాకు 14 పాయింట్లు లభించాయి.

ఉత్సాహంగా యువజనోత్సవ పోటీలు

కడప స్పోర్ట్స్: స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ముందస్తుగా నిర్వహించిన యువజనోత్సవ కాంపిటీషన్స్ ఉత్సాహంగా సాగాయి. బుధవారం కడప లోని గురుకుల్ విద్యాపీఠ్‌లో వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల సీఈఓ వివేకానంద, హెచ్ఎం మునిచంద్ర, జోసఫ్, చంద్రమౌళి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు కర్నాటకలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి యువజనోత్సవాలకు వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన క్రీడాకారులు పయనమయ్యారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



హరిదాసుకు బియ్యం వేస్తున్న సాయివిజ్ఞాన్ కరస్పాండెంట్ మైథిలీ, డైరెక్టర్ భూపతి



నాగార్జున మోడల్‌స్కూల్లో గోమాతకు పూజలు చేస్తున్న కరస్పాండెంట్ శ్రీదేవి



గురుకుల విద్యాపీఠ్‌లో హరిదాసుకు బియ్యం వేస్తున్న కరస్పాండెంట్లు



శ్రీ చైతన్య స్కూల్లో విద్యార్థినికి గాలిపటం అందజేస్తున్న ప్రిన్సిపల్ సుబ్బరాజు

కడప ఎడ్యుకేషన్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని బుధవారం కడప నగరంలోని పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు సంప్రాదాయ దుస్తులతో వచ్చి అందరినీ అలరించారు. అలాగే మరికొంత మంది చిన్నారులు హరిదాసు వేషధారణలో వచ్చి ఆకట్టుకున్నారు. దీంతోపాటు మరికొన్ని పాఠశాలల్లో మహిళలు, విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా సాయివిజ్ఞాన్, నాగార్జున మోడల్‌స్కూల్, భాష్యం స్కూల్, గురుకుల విద్యాపీఠ్, శ్రీచైతన్య, నారాయణ స్కూల్, ఫోకస్ స్కూల్లో సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు.

ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్

కడప అర్బన్: కడప నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మూడవరోజున బుధవారం జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్ -2023 ఉల్లాసంగా, ఉల్లాసంగా కొనసాగింది. జిల్లాలోని 6 పోలీస్ సబ్ డివిజన్‌ల పరిధిల్లోని పోలీస్ స్టేషన్‌ల నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. హాకీ, వాలీబాల్, కబడ్డీ, పుట్‌బాల్, బాస్కెట్‌బాల్, మహిళలకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగంలో పరుగు పోటీలతో పాటు హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో విభాగాల్లో పోటీలు జరిగాయి. పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఏఆర్ అదనపు ఎస్పీ వి కృష్ణారావు, ఏ.ఆర్ డీఎస్పీ రమణయ్య పర్యవేక్షించారు.



భక్తిశ్రద్ధలతో శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన

కడప కల్చరల్ : భారత దేశ సంగీత సంప్రదాయానికి మారుపేరుగా నిలిచిన శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని బుధవారం కడప నగరంలో జిల్లా నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎగువ గడ్డ రంగయ్య ఆధ్వర్యంలో చిన్నచౌకుకు చెందిన పలువురు నాయీ బ్రాహ్మణులు ప్రత్యేక వాహనంపై త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి సమీప వీధుల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా త్యాగయ్యకు ఘనంగా నివాళులర్పించారు. కళాకారులు మేళతాళాలు, వాయిద్య ప్రదర్శనలతో స్వామికి స్వర నీరాజనాలు అందజేశారు. స్థానిక అశోక్‌నగర్‌లోని ప్రధాన వీధుల ద్వారా ఊరేగింపు సాగింది. సంఘం కార్యదర్శి రంగయ్య పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిటకిటలాడిన బస్టాండు



ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రయాణికుల రద్దీ

కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో బుధవారం కడప ఆర్టీసీ, పాత బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. సుమారు వారం రోజులపాటు సెలవులు రావడంతో కడప నగరంతో చదువుకుంటున్న విద్యార్థులతోపాటు వివిధ ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం కడపలో ఉంటున్న వారు తమతమ స్వస్థలాలకు బయలుదేరి వెళ్లారు. దీంతో బస్టాండ్లలో తీవ్ర రద్దీ నెలకొంది. బస్సుల్లోకి ఎక్కేందుకు సీట్ల కోసం ఎగబడ్డారు. చిన్నారులు, వృద్ధులు కొంతమేర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపేందుకు అనేక చర్యలు చేపట్టారు. బస్టాండులో ఆర్టీసీ సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణికులు అసౌకర్యాలు తలెత్తకుండా చూశారు.

నేటి నుంచి గ్రామీణ కళా ఉత్పత్తులమేళా

కడప కల్చరల్ : కడప నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో గురువారం నుంచి నాబార్డు సహకారంతో నగరానికి చెందిన దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణకళా ఉత్పత్తుల మేళా నిర్వహించనున్నట్లు దాస్ సంస్థ అధ్యక్షులు ఓబులదాస్ తెలిపారు. సాయంత్రం 4.00 గంటలకు నగర ప్రముఖులు ఈ మేళాను ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్‌కశ్యప్, నాబార్డుజీఎం జయ కన్నన్‌లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వారం పాటు నిర్వహించనున్న ఈ మేళాలో దాదాపు 70కి పైగా వివిధ రకాల ఉత్పత్తుల స్టాల్స్‌నుఏర్పాటు చేయనున్నారని తెలిపారు. జిల్లాలోని స్వయం సహాయక బృందాలు, గ్రామీణ ప్రాంతాల మహిళలు రూపొందించిన హస్తకళారూపాలను ఈ మేళాలో ప్రదర్శన, అమ్మకాలకు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

వల్లూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లీ, జిల్లా క్షయవ్యాధి నోడల్ ఆఫీసర్ డాక్టర్ గోపీకృష్ణలు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. క్షయ, కుష్టు వ్యాధులను పూర్తిస్థాయిలో తగ్గించడానికి చేపట్టాల్సిన చర్యలను గురించి, అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ వందన యోజన, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నలక్ష్మి, సీహెచ్‌ఓ వేణుగోపాల్, ఫార్మసిస్టు శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కడప కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈనెల 12వ తేది గురువారం డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు ఎస్. మునిశంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటలలోపు 08562-242457 నంబర్‌కు ఫోన్ చేసి, తమ సమస్యలను తెలిపి పరిష్కారాలు పొందవచ్చని తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్: నబీకోటకు చెందిన వెంకటరమణ (50) ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉలసయ్య తెలియజేశారు.

జిల్లాలో పోలీసుల దాడులు: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, అక్రమమద్యంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 3 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఒకరిని అరెస్ట్ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు.

దొంగ అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప, ఎర్రగుంట్ల నమోదైన కేసుల్లో విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన గొల్లు దినేష్ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం నిందితుడి అరెస్టు వివరాలను తెలియజేశారు. కడప రైల్వే పోలీసు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్‌బాబా ఆదేశాల మేరకు రైల్వే ఎస్ఐ రారాజు, ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ వర్మకుఅందిన సమాచారంమేరకు నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి మొత్తం 89.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని గురువారం కోర్టులో హాజరు పరచనున్నామని తెలిపారు.